# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 138 31-5-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## 'ఎస్ఐఆర్'పై వైసీపీ క్యాడంను అప్రమత్తం చేసిన సజ్జల

- 'వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమంపై వైసీపీ ముఖ్య నేతలతో సజ్జల సమీక్ష
- ప్రభుత్వ హామీల వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపు
- డీఎస్సీ, నిత్యావసరాల ధరల పెరుగుదలపై పోరాటం ఉధృతం చేయాలని ఆదేశం
- ప్రభుత్వ వైఫల్యాలపై తీర్మానాలు చేసి డిజిటల్ మీడియాలో ప్రచారం చేయాలని సూచన



## మంత్రాలయం వద్ద విషాదం.. తుంగభద్రలో ఐదుగురు గల్లంతు

- మృతుల్లో ఐదేళ్ల బాలుడు, హైదరాబాద్‌కు చెందిన తండ్రీకొడుకులు
- సత్యనారాయణ వ్రతం తర్వాత స్నానానికి వెళ్లి ప్రమాదం
- గల్లంతైన వారి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు
- ప్రమాదం నుంచి బయటపడిన అపర్ణ



## బాల్క సుమన్ అరెస్ట్..

### తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత!

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో పోలీసులు మాజీ ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకున్నారు. ఏసీపీ ప్రవీణ్ పోలీసు బృందంతో కలిసి భవన్ లోనికి వెళ్లి అరెస్ట్ చేశారు. అనంతరం నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అనంతరం బాల్క సుమాన్ మీడియాతో మాట్లాడారు. "ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మూడు సంవత్సరాల పాలనలో వారు ఇచ్చిన హామీలపై గట్టిగా మాట్లాడిన వారిపై కేసులు పెడుతున్నారు. 2009 నుంచి 2014 వరకు నన్ను టార్గెట్ చేసి జైళ్లలో ఉంచారు. గతంలో 226 కేసు లు పెట్టారు. ఆ రికార్డు బద్దలు కొట్టాలని ఈ ప్రభుత్వం చూస్తుంది. మొన్న క్యాతన్‌పల్లిలో



## అమరావతి అర్బన్ మొబిలిటీ ప్లానింగ్ పై ఫోకస్

- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 61వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం
- భవిష్యత్ ప్రణాళికలపై చర్చ.. మొత్తం 18 ప్రతిపాదనలకు ఆమోదం
- హైకోర్టు భవనాల వద్ద రూ.547 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన
- అమరావతికి సొంత అగ్నిమాపక విభాగం, బిల్డింగ్ ట్రైబ్యునల్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- 9 జిల్లాలను కలుపుతూ అమరావతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధికి ప్రణాళిక

అమరావతి రాజధాని నిర్మాణ పనుల్లో వేగం పెంచే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శనివారం ఆయన అధ్యక్షతన జరిగిన 61వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో 18 కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేశారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రాజధానిలో పటిష్టమైన అర్బన్ మొబిలిటీ ప్లానింగ్ ఉండాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో భాగంగా, హైకోర్టు భవనాలకు సంబంధించి వివిధ మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.547.07 కోట్లు కేటాయించడానికి అథారిటీ ఆమోదం తెలిపింది. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు పీపీపీ పద్ధతిలో జెయింట్ అబ్జర్వేషన్ వీల్ నిర్మాణానికి, భవన నిర్మాణ వివాదాల సత్వర పరిష్కారానికి ప్రత్యేక బిల్డింగ్ ట్రైబ్యునల్ ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో పాటు, అమరావతిలో సమర్థవంతమైన అగ్నిమాపక నియంత్రణ కోసం సీఆర్డీఏకు

## ఉచిత విద్యుత్ ఎత్తేయం

- ఈ రెండూ చేయాల్సి వస్తే మేం ఎన్నికల్లోనే పోటీ చేయం
- మేం అవి చేయకపోతే బీఆర్ఎస్ పోటీ నుంచి తప్పుకుంటుందా?
- కుప్పకూలిన డిస్కంలను బతికించేందుకే రైతు డిస్కం తెచ్చాం
- సాగుకు మీటర్లు పెట్టాలని కేంద్రం ఎప్పుడూ నిబంధన విధించలేదు
- రైతుల కోసం తానేదో యుద్ధం చేశానని చెప్పుకునేందుకే నాడు కేసీఆర్ అలా చెప్పారు
- కేంద్రం ధాన్యం కొనకపోతే బీజేపీ నేతల ఇళ్ల ముందు ట్రాక్టర్లలో తెచ్చి పోస్తాం
- జూన్ 15 లోపు ధాన్యమంతా కొంటాం
- కల్వకుంట్ల కుటుంబమంతా అబద్ధాల మీదనే బతుకుతుంది

హైదరాబాద్: రాష్ట్ర రైతాంగానికి 24 గంటలూ నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇచ్చే కార్యక్రమం కొనసాగుతుందని, ఆ పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఎత్తేసేది లేదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే ఆలోచన తమకు లేదని తేల్చిచెప్పారు. అసలు రైతుల మోటార్లకు మీటర్లు పెట్టాలన్న నిబంధన కేంద్రం ఎప్పుడూ పెట్టలేదని చెప్పిన రేవంత్.. ఉచిత విద్యుత్, స్మార్ట్ మీటర్ల విషయంలో బీఆర్ఎస్‌కు సవాల్ చేశారు. ఉచిత విద్యుత్ ఎత్తేసినా, వ్యవసాయానికి మీటర్లు పెట్టినా వచ్చే ఎన్నికల్లో తాము పోటీ చేయబోమని, తాము అలా చేయకపోతే బీఆర్ఎస్ పోటీ నుంచి తప్పుకుంటుందా అని వ్యాఖ్యానించారు. శనివారం రేవంత్‌రెడ్డి విలేకరులతో ఇష్టాగోష్ఠి మాట్లాడారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే.. 'మేం అధికారంలోకి వచ్చేసరికి తెలంగాణలోని డిస్కంలు కుప్పకూలే పరిస్థితిలో ఉన్నాయి. డిస్కంలకు ఇప్పుడు రూ.69,745 కోట్ల అప్పులున్నాయి. అవి బాగుచేయలేనంతగా నిర్వీర్యమయ్యాయి. ఉచిత విద్యుత్ కింద రైతులకిచ్చే కరెంటుకు ఒక్క రూపాయి కూడా గత ప్రభుత్వం డిస్కంలకు చెల్లించలేదు. దీంతో డిస్కంలు అప్పులు చేసి బొగ్గు, విద్యుత్ కొనుగోలు చేసుకోవాల్సి వచ్చేది.





## జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను సందర్శించిన పవన్ కల్యాణ్

- నాయుడుపేటలోని జిందాల్ ప్లాంట్‌లో చెత్త నుంచి విద్యుత్ తయారీ
- ఉత్పత్తి, వ్యయం తదితర వివరాలను తెలుసుకున్న పవన్ కల్యాణ్
- కాకినాడ జిందాల్ ప్లాంట్ పై ఆరా తీసిన డిప్యూటీ సీఎం

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నెల్లూరు జిల్లా నాయుడుపేటలోని జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' (చెత్త నుంచి విద్యుత్ తయారుచేసే) ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాంట్ నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను ఆయన నిశితంగా పరిశీలించారు. ప్లాంట్ ప్రతినిధులతో మాట్లాడిన పవన్ కల్యాణ్.. చెత్త నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి అవుతున్న వ్యయం, ప్లాంట్ రోజువారీ నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉత్పత్తి అవుతున్న విద్యుత్ ఎంత? అలాగే యూనిట్ విక్రయ ఛార్జీల వివరాలు ఏంటి? అనే అంశాలను ప్లాంట్ ప్రతినిధులు ఉపముఖ్యమంత్రికి వివరంగా వివరించారు.

## రాజస్తాన్, ఢిల్లీ అతలాకుతలం

### దుమ్ము తుపాను, భీకర గాలుల బీభత్సం

న్యూఢిల్లీ/జైపూర్: ప్రకృతి ప్రకోపానికి శనివారం దేశరాజధాని ఢిల్లీ--ఎన్సీఆర్ ప్రాంతాలతోపాటు రాజస్తాన్ అతలాకుతలమైంది. జాతీయరాజధాని పరిధి(ఎన్సీఆర్)లోని చాలా చోట్ల వరుణుడు తన ప్రతాపం చూపించాడు. దీనికితోడు గంటకు 70 కిలోమీటర్ల వేగంతో దుమ్ము గాలులు వీస్తూ స్థానికులను తీవ్ర ఇబ్బందులపాల్జేశాయి. థార్ ఎడారికి నిలయమైన

2లో



## సీఎల్పీ నేతగా డీకేఎస్ ఏకగ్రీవం

- ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించిన రాష్ట్ర గవర్నర్
- 3న కర్ణాటక నూతన సీఎంగా శివకుమార్ ప్రమాణ స్వీకారం

2లో



## రాష్ట్ర ప్రభుత్వం చేతకానితనాన్ని కేంద్రంపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారు

- రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న కిషన్ రెడ్డి
- రైతులు ఇబ్బంది పడుతుంటే.. మంత్రులు ఏసీ రూముల్లో గడుపుతున్నారని విమర్శ

2లో



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



# జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను సందర్శించిన పవన్ కల్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

ఈ పర్యటనలో కాకినాడలో నిర్మిస్తున్న జిందాల్ ప్లాంట్ ఆలస్యంపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. కాకినాడ జిందాల్ ప్లాంట్ ఇంకా ఎందుకు వినియోగంలోకి రాలేదని ఆయన ప్రశ్నించగా... రాబోయే నవంబరు లోపు ఆ ప్లాంట్‌ను కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని జిందాల్ ప్రతినిధులు డిప్యూటీ సీఎంకు హామీ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా.. ఇటువంటి విద్యుత్ ప్లాంట్ల వల్ల పరిసర ప్రాంతాల్లో కాలుష్యం ఏ మేరకు పెరుగుతోంది, దాన్ని అదుపు చేయడానికి తీసుకుంటున్న జాగ్రత్తలు ఏమిటనే దానిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. దీనిపై జిందాల్ ప్రతినిధులు స్పందిస్తూ.. కాలుష్య నియంత్రణ మండలి ఏడాదికి నాలుగుసార్లు ప్లాంట్‌ను పరిశీలించి నివేదిక ఇస్తోందని ఉపముఖ్యమంత్రికి వివరించారు.

# రాష్ట్ర ప్రభుత్వం చేతకానితనాన్ని కేంద్రంపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారు


మార్పు పేరుతో దొంగ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా, నిస్సిగ్గుగా వ్యవహరిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దళారులు, రైస్ మిల్లర్ల చేతుల్లో చిక్కి రైతులు విలవిలలాడుతుంటే, మంత్రులు ఏసీ రూముల్లో గడుపుతున్నారని మండిపడ్డారు. ధాన్యం సేకరణలో రాష్ట్ర ప్రభుత్వ చేతకానితనాన్ని కేంద్రంపై నెట్టేయాలని చూస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. కేంద్రం ఎప్పుడూ తెలంగాణ నుంచి ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువ ధాన్యాన్ని సేకరిస్తోందని స్పష్టం చేశారు. 52.24 లక్షల మెట్రిక్ టన్నుల ఒప్పందానికి గాను, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 51 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించగలిగిందని గణాంకాలను వెల్లడించారు. ఇక్కడ పండే నాణ్యమైన సన్న బియ్యాన్ని ఎక్కువ ధరకు ఇతర రాష్ట్రాలకు అమ్ముకుంటూ, పేద ప్రజలకు మాత్రం ఇతర రాష్ట్రాల నుండి తెచ్చిన నాసిరకం బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేవలం కమీషన్లు, భూ దందాలపైనే శ్రద్ధ పెడుతూ, రైతుల ఉసురు పోసుకుంటున్నాయని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బాల్క సుమన్ అరెస్ట్..

(మొదటి పేజీ తరువాయి)

కూడా నన్ను అరెస్ట్ చేసి జైళ్లలో ఉంచారు. వాళ్ళ కడుపు మంట చల్లారలేదు ఏమో? మళ్ళీ నా మీద కేసులు పెట్టారు. ఈ అరెస్టులు కేసులు అన్ని మా లీగల్ టీమ్ చూసుకుంటుంది. నేను పారిపోయాను అని కొన్ని ఛానెల్స్ వేస్తున్నాయి. నేను ఎక్కడికి పారిపోలేదు. తెలంగాణ భవన్ లోనే ఉన్నాను. అంతిమంగా న్యాయం ధర్మం గెలుస్తుంది." అని పేర్కొన్నారు. ఇక, ఈ నెల 26వ తారీఖున తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీటింగ్‌లో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై 27వ తేదీ ఉదయం సుమన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. 27వ తేదీ నుంచి మూడు రోజులుగా తెలంగాణ భవన్‌లోనే బాల్క సుమన్ ఉంటున్నారు. తెలంగాణ భవన్ బయట మూడు రోజులుగా టాస్క్ ఫోర్స్ పోలీసులు కాపుకాస్తున్నారు. ఈరోజు సుమన్ అరెస్ట్ చేసేందుకు ఏసీపీ, పోలీసులు తెలంగాణ భవన్‌కు వచ్చారు. ఇంతలో సుమన్ అరెస్ట్ అయ్యారనే వదంతులు వ్యాప్తించాయి. తాను అరెస్ట్ కాలేదని.. ఇక్కడే ఉన్నానని సుమన్ తెలిపారు. అరెస్టు చేస్తే న్యాయపరంగా ఎదుర్కొంటానని చెప్పారు. ఇంతలో తెలంగాణ భవన్‌కు సుమన్ తరపు అడ్వకేట్ చేరుకున్నారు. "ముందస్తు బెయిల్ మూవ్ చేశాం.. అది తెలిసే పోలీసులు కావాలని హంగామా చేస్తున్నారు. పబ్లిక్ ప్రాపర్టీ డ్యామేజ్ చేస్తే.. పెట్టాల్సిన కేసులు పెట్టారు. డ్యామేజ్ చేద్దాం అని మాత్రమే అన్నారు సుమన్. ఆ కేసులు వర్తించవు. లీగల్‌గా ప్రొసీడ్ అవుతాం. విచారణకి సహకరిస్తాం అని చెప్పాం." అని సుమన్ అడ్వకేట్ తెలిపారు. అడ్వకేట్ భవన్‌లోకి వెళ్లిన కొద్ది సమయానికే పోలీసులు సుమన్‌ను అరెస్ట్ చేశారు.

# మంత్రాలయం వద్ద విషాదం.. తుంగభద్రలో ఐదుగురు గల్లంతు



కర్నూలు జిల్లాలోని పుణ్యక్షేత్రం మంత్రాలయం వద్ద తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నిన్న సాయంత్రం తుంగభద్ర నదిలో స్నానానికి దిగిన ఐదుగురు వ్యక్తులు గల్లంతయ్యారు. వీరిలో ఐదేళ్ల బాలుడు కూడా ఉండటంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం, ఒకే కుటుంబానికి చెందిన బంధువులు మంత్రాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం కోసం హాజరయ్యారు. పూజ ముగిసిన తర్వాత, వారిలో ఆరుగురు సరదాగా స్నానం చేసేందుకు తుంగభద్ర నదిలోకి దిగారు. అయితే, నదిలో నీటి లోతును అంచనా వేయడంలో విఫలమవ్వడంతో పాటు, ప్రవాహం వేగంగా ఉండటంతో వారు నీటిలో కొట్టుకుపోయారు. ఈ ప్రమాదం నుంచి ఆదోనికి చెందిన అపర్ణ అనే మహిళ సురక్షితంగా బయటపడగా, మిగిలిన ఐదుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారిని హైదరాబాద్‌కు చెందిన సతీష్ (35), అతని కుమారుడు యువన్ చంద్ర (5), అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన సంధ్య (22), మంత్రాలయానికి చెందిన రాఘవేంద్ర (25), ధను (23)గా గుర్తించారు. గత రాత్రి పొద్దుపోయే వరకు గజ ఈతగాళ్లు, స్థానిక జాలర్ల సహాయంతో గాలింపు చర్యలు కొనసాగించారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం అధికారులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనతో బంధువుల ఇంట తీవ్ర విషాదం నెలకొంది.

# సీఎల్పీ నేతగా డీకేఎస్ ఏకగ్రీవం



బెంగళూరు: కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. కాంగ్రెస్ శాసనసభాపక్ష(సీఎల్పీ) నేతగా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ సజావుగా సాగింది. బెంగళూరు విధానసౌధలో శనివారం సాయంత్రం 4 గంటలకు సీఎల్పీ సమావేశం జరిగింది. ఏఈ భేటీలో స్పీకర్ యూటీ ఖాదర్ సహా నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వేర్వేరు కారణాలతో హాజరు కాలేకపోయారు. మిగిలిన ఎమ్మెల్యేలందరూ పాల్గొన్నారు. అనుకున్న సమయానికే డీకే శివకుమార్ విధానసౌధకు చేరుకున్నారు. విధానసౌధ గడపకు నమస్కరించి లోపలికి వెళ్లారు. సీఎల్పీ నాయకుడిగా డీకే శివకుమార్ పేరును ఆపద్ధర్మ సీఎం సిద్ధరామయ్య ప్రతిపాదించారు. "మన శాసనసభాపక్ష నాయకుడు డీకే శివకుమార్"అంటూ ఏకవాక్య తీర్మానాన్ని ప్రతిపాదించగా, కాంగ్రెస్ సీనియర్ నేత, హోంమంత్రి పరమేశ్వర ఆమోదించారు. తర్వాత ఎమ్మెల్యేలందరూ చేతులెత్తి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం సీఎల్పీ నేతగా శివకుమార్ ఎన్నికైనట్లు కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులుగా కేసీ వేణుగోపాల్, రణదీప్ సింగ్ సూర్జేవాలా పాల్గొన్నారు. అయితే, ఈ భేటీ మధ్యలో 10 నిమిషాలపాటు విరామం తీసుకోవడం విశేషం. సిద్ధరామయ్య, కేసీ వేణుగోపాల్, సూర్జేవాలా ప్రత్యేకంగా మరో గదిలో కొద్దిసేపు సమావేశమైనట్లు తెలిసింది. సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ఇన్నాళ్లూ అందించిన సేవలను కొనియాడుతూ సీఎల్పీ భేటీలో డీకే శివకుమార్ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, ఏకగ్రీవంగా ఆమోదం పొందింది.

**గవర్నర్‌తో భేటీ**

సీఎల్పీ సమావేశం కంటే ముందు డీకే శివకుమార్ లోక్‌భవన్‌కు వెళ్లడం ఆశ్చర్యానికి గురిచేసింది. లోక్‌భవన్‌లో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌ను డీకే శివకుమార్, ఆయన సోదరుడు డీకే సురేశ్ కలిసి చర్చించారు. ప్రభుత్వ ఏర్పాటు, మంత్రివర్గం కూర్పుపై గవర్నర్‌కు సమాచారం అందించారు. గవర్నర్‌తో భేటీ అనంతరం ప్రమాణ స్వీకారాన్ని జూన్ 3న సాయంత్రం 4.05 గంటలకు ఖరారు చేసుకున్నారు.

అదేరోజు మరో 14 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, సీఎల్పీ నేత ఎన్నిక పూర్తయిన తర్వాత డీకే శివకుమార్, సిద్ధరామయ్య, సీనియర్ నేతలు కలిసి లోక్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు గవర్నర్‌కు తెలియజేశారు. అసెంబ్లీలో తమకు సంపూర్ణ మెజార్టీ ఉందని తెలిపారు. ఈ మేరకు లేఖ అందించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ డీకే శివకుమార్‌ను గవర్నర్ ఆహ్వా?వనించారు.

**జూన్ 3న నిరాడంబరంగా ప్రమాణం**

సీఎల్పీ భేటీలో డీకే శివకుమార్ ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి కరచాలనం చేస్తూ పలకరించారు. జూన్ 3న సాయంత్రం 4.05 గంటలకు లోక్‌భవన్‌లో ఆయన కర్ణాటక నూతన సీఎంగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. పెట్రోల్, డీజిల్ కొరత కొనసాగుతుండడంతోపాటు బెంగళూరులో ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని నిరాడంబరంగా ప్రమాణ స్వీకారం చేయాలని డీకే శివకుమార్ నిర్ణయించారు.

# రాజస్తాన్, ఢిల్లీ అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)

రాజస్తాన్‌లో ఇసుక తుపాన్ల ధాటికి జనజీవనం కొన్ని గంటలపాటు స్తంభించిపోయింది. దుమ్ము తుపాన్లకు పిడుగులు, మెరుపులు తోడవడంతో ఢిల్లీ--ఎన్సీఆర్, రాజస్తాన్ వాసులు శనివాం ప్రకృతి ప్రకోపానికి గురికావాల్సి వచ్చిందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. వాయవ్య భారతంలో రుతుపవనాల ఆగమనానికి సూచికగా ఉరుములు, మెరుపులతో కూడిన భీకర గాలులు వీయడాన్ని ఆంధీగా పిలుస్తారు. మే చివరివారంలో ప్రకృతి ఇలా దుమ్ము తుపాన్ల రూపంలో వాయవ్య భారతాన్ని చుట్టేస్తుంది. ఎండాకాలంలోని చండ ప్రచండ వేడిమికి భూమి ఉపరితలం అత్యధికంగా వేడెక్కుతుంది. దీంతో గాలిలో స్థిరత్వం అదుపుతప్పుతుంది. దీనికి ధూళి గాలులు తోడై దుమ్ము తుపానులను సృష్టిస్తాయి. వీటికి సమీపంలోని థార్ ఎడారికి నిలయమైన రాజస్తాన్ గుండా ఇసుకరేణువులు గాలితోపాటు ఎగిరొచ్చి ఢిల్లీ--ఎన్సీఆర్‌లో ధూళి బీభత్సం సృష్టిస్తున్నాయి. రాజస్తాన్‌లోని చాలా ప్రాంతాల్లో శనివారం సైతం ఇసుక తుపాన్లు, వర్షం స్థానికులను తెగ ఇబ్బందులకుగురిచేశాయి. దుమ్ముతోపాటు ఇసుక గాల్లోకి లేవడంతో రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో రహదారులపై దుమ్ము కమ్ముకుంది. దీంతో ప్రయాణికులకు రహదారులపై ఏముందో కని?పంచకపోవడంతో డ్రైవర్లు పట్టపగలే హెడ్‌లైట్లు ఆన్‌చేసుకుని జాగ్రత్తగా ప్రయాణాలు కొనసాగించారు. హనుమాన్‌గఢ్, శ్రీ గంగానగర్ రీజియన్లలో ఇసుక తుపాను ప్రభావం ఎక్కువగా కన్పించింది. భీకర గాలుల ధాటికి చాలా చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలాయి. గత 24గంటల్లో ఛురు, హనుమాన్‌గఢ్, శ్రీ గంగానగర్, బికనీర్, నాగౌర్, దిద్వానా--కుఛమాన్, ఆల్వార్, సికార్‌లలో తుపాను బీభత్సం సృష్టించింది. "ఇంతటి ఇసుక తుపాను జీవితంలో చూడలేదు. మధ్యాహ్నం 2 గంటలకు ఒక్కసారిగా నగరంలో చీకట్లు కమ్ముకున్నాయి"అని ఛురు నగర వాసి చెప్పారు. దుమ్ము తుపాన్లతోపాటు ఉరుములతో కూడి వర్షాలు పడ్డాయి. మరో నాలుగైదు రోజులపాటు ఇదే పరిస్థితి ఉంటుందని రాష్ట్ర వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు.

# 'ఎస్ఐఆర్'పై వైసీపీ క్యాడంను అప్రమత్తం చేసిన సజ్జల

అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా ఏపీలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ఈ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి నిరసన కార్యక్రమాలను ఉధృతం చేయాలని వైసీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 'వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసన కార్యక్రమంపై ఆయన పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిన్న జూమ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. "చంద్రబాబు ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది. ఈ అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి 'వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసనలను విజయవంతం చేయాలి. ప్రజాసంఘాలు, వివిధ వర్గాల ప్రతినిధులతో పాటు కలిసివచ్చే రాజకీయ పార్టీలను కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములను చేయాలి"

# అమరావతి అర్బన్ మొబిలిటీ ప్లానింగ్ పై ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

సొంత ఫైర్ వింగ్ ఏర్పాటు చేసుకునేందుకు అంగీకరించారు. ఏలూరు నుంచి ప్రకాశం వరకు 9 జిల్లాలకు విస్తరించే అమరావతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు కూడా అంగీకారం తెలిపారు. రాజధానిలోని అన్ని భవనాలకు సెంట్రల్ కూలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ప్రతి టౌన్‌షిప్‌లో ఆర్థిక కార్యకలాపాలు ఉండేలా చూడాలని సీఎం సూచించారు. వీటితో పాటు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్, ఎల్పీఎస్ లేఅవుట్లలో ఏటీఎంల ఏర్పాటు, 495 మంది రైతులకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు వంటి పలు అంశాలను అథారిటీ ఆమోదించింది. ఈ సమావేశంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, సీఎస్ జి. సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లో 'యోగాంధ్రప్రే2026' కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ 21న జరిగే ఈ వేడుకను విజయవంతం చేసేందుకు కోటి మంది ప్రజలను భాగస్వాములను చేయడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో ఈ కార్యక్రమ నిర్వహణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా, జూన్ 21న రాజధాని అమరావతిలో 25 వేల మందితో రాష్ట్ర స్థాయి యోగా ఈవెంట్ నిర్వహించనున్నారు. కృష్ణా నదిపై కొత్తగా నిర్మించిన వంతెనపై జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పాల్గొంటారు. అదే రోజున అన్ని జిల్లా కేంద్రాల్లో వెయ్యి మంది చొప్పున యోగా కార్యక్రమాలను నిర్వహిస్తారు. వీటిలో మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొంటారు. జూన్ 7 నుంచి 14 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా యోగా వారోత్సవాలు జరగనున్నాయి. "ఒక జిల్లా – ఒక థీమ్"తో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తారు. పార్కులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు రాష్ట్రంలోని 56 పర్యాటక కేంద్రాల్లో ప్రత్యేక యోగా సెషన్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు గాను ప్రతి జిల్లాకు రూ. 25 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. ప్రస్తుతం ఉన్న 1.50 లక్షల మంది యోగా శిక్షకులకు అదనంగా మరో లక్ష మందికి శిక్షణ ఇచ్చి, వారిని కూడా ఈ కార్యక్రమంలో భాగం చేయనున్నారు.

**ప్రజలకు అందుబాటులో యోగా వీడియోలు**

ఈ సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వ యోగా, నాచురోపతి విభాగ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు రూపొందించిన 'యోగాంధ్ర' పోస్టర్‌ను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. వివిధ ఆసనాలు, ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలపై తాను రూపొందించిన వీడియోలను ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉంచుతున్నట్లు మంతెన తెలిపారు.

# ఉచిత విద్యుత్ ఎత్తేయం

(మొదటి పేజీ తరువాయి)

అందులో భాగంగానే రైతులతో పాటు ప్రభుత్వం గంపగుత్తగా కరెంటును వినియోగించుకునే కేటగిరీని కలిపి ప్రత్యేకంగా రైతు డిస్కం ఏర్పాటు చేశాం. దీనిద్వారా ఎంత విద్యుత్ తీసుకున్నామో, ఎంత సరఫరా చేశామో, నిర్వహణ నష్టాలు ఎంతో, బిల్లులు ఎంత వస్తున్నాయో కచ్చితంగా లెక్క తేలుతుంది. తెలంగాణ రైతాంగం రాత్రిపూట పెద్దగా వ్యవసాయానికి విద్యుత్ వాడదు కాబట్టి ధర తక్కువ ఉన్నప్పుడు కొనుగోలు చేసి ఆ డిస్కం ద్వారా రైతులకు విద్యుత్ ఇస్తాం. అసలు మాకు ఉచిత విద్యుత్ ఎత్తేయాలనే ఆలోచనే లేదు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు కూడా పెట్టబోం. అలా పెట్టేది ఉంటే వచ్చే ఎన్నికల్లో మేం పోటీ చేయబోం. ఒకవేళ మేం పెట్టకపోయినా, ఉచిత విద్యుత్ ఎత్తేయకపోయినా బీఆర్ఎస్ పోటీ చేయకుండా ఉంటుందా? బీఆర్ఎస్ నా సవాల్‌ను స్వీకరించాలి. అసలు స్మార్ట్ మీటర్ల విషయంలో కేంద్రంతో ఒప్పందం చేసుకుంది బీఆర్ఎస్సే. 2017, జూన్ 30న అజయ్‌మిశ్రా, రఘుమారెడ్డి, గోపాలరావు అనే అధికారులు ఈ ఒప్పందంపై సంతకాలు పెట్టారు. 2017--18లో 29,632 స్మార్ట్ మీటర్లు కూడా పెట్టారు. కేంద్రం ఏ రోజూ వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలని అడగలేదు. అసలు అలాంటి నిబంధనే లేదు. నోరు తెరిస్తే కేసీఆర్ చెప్పేది అబద్ధాలే. రైతుల కోసం తామేదో యుద్ధం చేసినట్టు అప్పట్లో చెప్పుకుని రైతుల దగ్గర మార్కులు కొట్టేయాలని అలాంటి మాటలు చెప్పారు. రైతులు ఆయన కంటే తెలివైన వారు కాబట్టి కర్రు కాల్చి వాత పెట్టారు. మోదీ నా చుట్టమేమీ కాదు. ఆ పథకంలో దేశంలోని అన్ని రాష్ట్రాలు చేరాయి. ఏపీ కూడా చేరింది. నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా రాష్ట్రమంతటా స్మార్ట్ మీటర్లు పెట్టినా వ్యవసాయానికి మాత్రం పెట్టలేదు. తీగల మీద బట్టలు ఆరేయాలని కేసీఆర్ అన్నప్పుడే 1999 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు కాంగ్రెస్ హామీ ఇచ్చింది. 2004లో అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసింది. కాంగ్రెస్సే. నాణ్యమైన విద్యుత్ ఇచ్చి రైతుల ఆత్మగౌరవం పెంచడానికి తెచ్చిన పారదర్శక విధానమే రైతు డిస్కం. సీఆర్పీసీ, ఐపీసీల్లో శిక్షలు వేసేందుకు నిబంధనలు లేవా? మరి ఎస్సీ, ఎస్టీ కమిషన్, మహిళా కమిషన్, హెచ్ఆర్సీ, మైనార్టీ కమిషన్లు ఎందుకు ఏర్పాటు చేశారు. బీసీ కమిషన్‌ను ఎందుకు అడుగుతున్నారు. తమ వర్గాలకు కమిషన్ ఉంటే న్యాయం జరుగుతుందనే



కదా. ఆ తరహాలోనిదే రైతు డిస్కం కూడా.

**మోదీకి కిషన్‌రెడ్డి చెప్పాలి కదా?**

బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి కేసుల్లో సీబీఐ విచారణను రాష్ట్ర ప్రభుత్వం కోరిన తర్వాత కూడా కేంద్రం ఎందుకు స్పందించడం లేదు. కనీసం సీబీఐ వాళ్లు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు. తుమ్మిడిహెట్టిపై చర్చిద్దామంటే మహారాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదు. తెలంగాణ ప్రయోజనాల కోసం ఈ విషయాలను మోదీ దగ్గర కిషన్‌రెడ్డి చెప్పాలి కదా? అంతర్రాష్ట్ర జలవివాదాలు రాష్ట్రాలే పరిష్కరించుకోవాలని మోదీ చెబుతున్నారు కదా? వచ్చే నెల1న ఆదిలాబాద్‌కు వెళ్తున్నా. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎలా దారిలోకి రాడో చూస్తా.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

# బాసర ట్రిపుల్ ఐటీకి చల్లూరు విద్యార్థిని

- ప్రతిభ చాటిన జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని స్రవంతి
- విద్యార్థిని, ఉపాధ్యాయులను అభినందించిన ప్రజాప్రతినిధులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



**తొలివెలుగు, రాజాపేట:** మండలం చల్లూరు గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని జి. స్రవంతి ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్ ఐటీ (రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీస్ – ఐఐఐటీ)లో సీటు సాధించి సత్తా చాటింది. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన ఆమె, తన ప్రతిభతో ఈ ఘనత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. వసంత, ఉపాధ్యాయ బృందం స్రవంతిని ప్రత్యేకంగా అభినందించారు. విద్య పట్ల ఆమెకున్న అంకితభావం, పట్టుదలే ఈ విజయానికి కారణమని వారు కొనియాడారు. భవిష్యత్తులో ఆమె మరింత కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ అరుదైన ఘనత సాధించిన విద్యార్థిని స్రవంతిని గ్రామ సర్పంచ్ భీమగాని రూప బాలనర్సయ్య అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇలాంటి అవకాశాలు దక్కించుకోవడం గొప్ప విషయమని, ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను ఆయన కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా తమ ప్రతిభతో ఉన్నత విద్యావకాశాలను అందిపుచ్చుకోగలరని స్రవంతి నిరూపించిందని ఉపసర్పంచ్ బొంత సుధాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్రవంతి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గ్రామస్తులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# చల్లూరులో వైభవంగా దుర్గమ్మ జాతర

- వేడుకల్లో పాల్గొన్న ఎంపీడీవో నాగవేణి బృందం
- అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక బోనాల సమర్పణ
- అధికారులను సత్కరించిన గ్రామ ప్రతినిధులు



**తొలివెలుగు, రాజాపేట:** మండలం చల్లూరు గ్రామంలో గ్రామదేవత దుర్గమ్మ జాతర ఉత్సవాలు శనివారం కన్నులపండువగా జరిగాయి. ఈ వేడుకల్లో రాజాపేట ఎంపీడీవో నాగవేణి, సూపరింటెండెంట్ అల్లం ఇన్నారెడ్డి, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి భీమగాని రూప బాలనరసయ్య, ఉప సర్పంచ్ బొంత సుధాకర్, జాతర నిర్వాహకులు, గ్రామ పెద్దలు కలిసి ఎంపీడీవో నాగవేణి, సూపరింటెండెంట్ అల్లం ఇన్నారెడ్డి తదితర అధికారులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. జాతరలో భాగంగా గ్రామంలోని అన్ని కులాలకు చెందిన వారు ఏకమై అమ్మవారికి సామూహికంగా బోనాలు సమర్పించారు. భక్తులు ప్రధాన వీధుల గుండా బోనాలతో, శివసత్తుల పూనకాలు, డప్పు వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి, భక్తిశ్రద్ధలతో తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాల్లో గ్రామస్తులు, వారి బంధుమిత్రులు, ఆప్తులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# సాయి మందిరంలో ప్రత్యేక పూజలు

- పెళ్లిరోజు సందర్భంగా నంగునూరు రాజు-రితిక దంపతుల దర్శనం
- వేదాశీర్వచనం చేసిన అర్చకులు
- రాజు దంపతులకు పలువురి శుభాకాంక్షలు

**తొలివెలుగు, రాజాపేట:** మండల ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు, శ్రీ రామకృష్ణ సాయి మందిరం ఆలయ అభివృద్ధి సేవా కమిటీ సభ్యుడు నంగునూరు రాజు–రితిక దంపతులు తమ వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చక స్వామి చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ.. రాజు దంపతులకు గోత్ర నామార్చన, అష్టోత్తర పూజలను శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం వారికి వేద ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు నంగునూరు సోమయ్య–ప్రణవి దంపతుల కుమార్తె సహస్ర జన్మదినాన్ని పురస్కరించుకుని చిన్నారి తల్లిదండ్రులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాగా, వివాహ దినోత్సవం జరుపుకుంటున్న రాజు–రితిక దంపతులకు రాజాపేట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, యాదగిరిగుట్ట లోటస్ టెంపుల్ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య నిత్యాన్న సత్ర సంఘం ప్రధాన కార్యదర్శి, సాయి మందిరం ట్రస్ట్ సభ్యుడు, రాజాపేట మండల జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు ఉప్పల రమేష్–స్వప్న దంపతులు ప్రత్యేకంగా వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. వీరితో పాటు పలువురు ప్రముఖులు, మిత్రులు సోషల్ మీడియా ద్వారా, నేరుగా రాజు దంపతులకు శుభాకాంక్షలు అందజేశారు.



# సమానత్వంతోనే కుటుంబ బంధాలు పటిష్టం

- ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని ప్రారంభించిన తహశీల్దార్ శ్రీనివాసరెడ్డి
- మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట
- మండల మహిళా సమైక్య కార్యాలయంలో కార్యక్రమం




**భూదాన్ పోచంపల్లి, (తొలివెలుగు ప్రతినిధి కేమ విష్ణు):** కుటుంబంలో స్త్రీ, పురుషులు సమానత్వ భావనతో మెలిగినప్పుడే కుటుంబ బంధాలు మరింత పటిష్టంగా ఉంటాయని భూదాన్ పోచంపల్లి తహశీల్దార్ శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం పురపాలక కేంద్రంలోని మండల మహిళా సమైక్య కార్యాలయంలో 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచులతో కలిసి రిబ్బన్ కత్తిరించి కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం నిర్వహించిన సమావేశంలో తహశీల్దార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, మహిళల ఆర్థికాభివృద్ధితో పాటు కుటుంబ సమైక్యతను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో ఉచిత న్యాయ సలహా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కుటుంబాల్లో తలెత్తే చిన్న చిన్న వివాదాలను గ్రామ పంచాయతీలు, పోలీస్ స్టేషన్ల వరకు తీసుకెళ్లకుండా ఈ కేంద్రాల ద్వారా సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవచ్చని సూచించారు. వివిధ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొనే మహిళలకు ఈ కేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని అన్నారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో, ఆత్మాభిమానంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళలతో కలిసి నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ఎస్ఐ లైల, ఏపీఎం తవారి నాయక్, ఏపీవో కృష్ణమూర్తి గౌడ్, సర్పంచులు సామ రవీందర్ రెడ్డి, పకీరులత నర్సిరెడ్డి, మచ్చ శ్రీనివాస్, మండల సమైక్య అధ్యక్షురాలు పారిజాత, కోశాధికారి లాస్య, సీసీలు కొండమడుగు మల్లేష్, వసంతలక్ష్మి, వీబీకేలు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాలను ప్రశ్నిస్తే.. అర్ధరాత్రి 'అంతానికి' యత్నం!

- వెంచర్లపై ఫిర్యాదు చేసినందుకు యువకుడిపై దాడి
- మాట్లాడుకుందామని పిలిచి కర్రలతో విచక్షణారహితంగా కొట్టిన దుండగులు
- నలుగురిపై పోలీసులకు ఫిర్యాదు.. పోచంపల్లిలో కలకలం



**భూదాన్ పోచంపల్లి, (తొలివెలుగు ప్రతినిధి కేమ విష్ణు):** అక్రమ వెంచర్ల వ్యవహారాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఓ యువకుడిపై అర్ధరాత్రి వేళ దాడి జరిగిన ఘటన భూదాన్ పోచంపల్లి పట్టణంలో తీవ్ర కలకలం రేపింది. మాట్లాడుకుందామని నమ్మించి పిలిపించి, కర్రలతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు గుత్తి బాలశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణగిరి సమీపంలో "పామ్ ల్యాండ్" పేరుతో నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారంటూ ఇటీవల మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో తనపై కక్ష పెంచుకున్న కంట మల్లేశం అనే వ్యక్తి ఈ విషయంపై మాట్లాడుకుందామని చెప్పి శుక్రవారం అర్ధరాత్రి సీతవాణిగూడెం ప్రాంతానికి పిలిచినట్లు పేర్కొన్నాడు. తాను అక్కడికి చేరుకున్న వెంటనే ముందస్తు పథకం ప్రకారం పొంచి ఉన్న మల్లేశంతో పాటు బబ్లు, కన్నె రాజు, కన్న బన్నీలు తనపై కర్రలతో దాడికి దిగారని ఆరోపించాడు. తనను చుట్టుముట్టి విచక్షణారహితంగా కొట్టడంతో పాటు ముఖం, కడుపు భాగాల్లో పిడిగుద్దులు కురిపించారని తెలిపాడు. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలై రక్తస్రావంతో కుప్పకూలిపోయినట్లు వాపోయాడు. దాడి సమయంలో అసభ్య పదజాలంతో దూషిస్తూ, ప్రాణాలు తీస్తామంటూ బెదిరించారని బాలశంకర్ ఆరోపించాడు. ఈ ఘటనపై శనివారం పోచంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. అక్రమాలను ప్రశ్నించినందుకే తనపై దాడి జరిగిందని పేర్కొంటూ, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. కాగా, పట్టణంలో జరిగిన ఈ దాడి స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.



# నిరుపేద కుటుంబానికి 'పదో తరగతి' మిత్రుల ఆసరా

- దృష్టి లోపమున్న యశోదకు రూ.50 వేల ఆర్థిక సాయం
- భర్తను కోల్పోయి రోడ్డున పడ్డ కుటుంబానికి చేయూత
- అడ్డగూడూరు ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల మానవత్వం

**తొలివెలుగు, అడ్డగూడూరు :** కష్టకాలంలో ఉన్న ఓ తోటి క్లాస్‌మేట్ కుటుంబ దీనస్థితిని చూసి చలించిన పూర్వ విద్యార్థులు తామున్నామంటూ ముందుకు వచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం కోటమర్తి గ్రామానికి చెందిన చిప్పలపల్లి యశోద రెండు కళ్లూ కనిపించని అంధురాలు. ఇటీవల ఆమె భర్త నాగయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో, ఇద్దరు పిల్లలున్న ఆ నిరుపేద కుటుంబం అగమ్యగోచరంగా మారింది. ఆ కుటుంబ ఉదంతం తెలుసుకున్న అడ్డగూడూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాల 2005–2006 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి మిత్రులు స్పందించారు. సహచర మిత్రులంతా కలిసి రూ.50,000 ఆర్థిక సాయాన్ని సేకరించారు. శనివారం కోటమర్తి గ్రామంలోని యశోద నివాసానికి వెళ్లిన పూర్వ విద్యార్థుల బృందం.. సేకరించిన నగదును ఆమెకు అందజేసి మనోధైర్యాన్ని నింపారు. తామంతా ఎల్లప్పుడూ ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా యశోద ఆవేదనతో మాట్లాడుతూ.. తన జీవితంలో ఎదురైన చీకటి రోజుల్లో ఆర్థికంగా, మానసికంగా వెన్నుదన్నుగా నిలిచిన క్లాస్‌మేట్స్ అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. స్నేహానికి, సేవాభావానికి నిదర్శనంగా నిలిచిన పూర్వ విద్యార్థుల చొరవను గ్రామస్తులు, స్థానికులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బాలెంల సైదులు, తుప్పతి బీరప్ప, చిప్పలపల్లి నాగరాజు, బాలెంల నరేష్, డప్పు వెంకన్న, పోలేపాక ఉపేందర్, బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# ధరల పెరుగుదలపై 'విప్' నిరసన సైకిల్ యాత్ర

- యాదగిరిగుట్ట నుంచి తుర్కపల్లి వరకు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రదర్శన
- కేంద్ర ప్రభుత్వం ఇంధన భారాన్ని తగ్గించాలి
- జూన్ 2 నాటికి ధాన్యం కొనుగోళ్లు పూర్తి కావాలి.. లేకుంటే అధికారులపై చర్యలు తప్పవు: ఎమ్మెల్యే బీర్ల



**తొలివెలుగు, చౌటుప్పల్/తుర్కపల్లి:** పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు నిరసనగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, బీర్ల అయిలయ్య శనివారం సైకిల్ యాత్ర చేపట్టారు. ప్రజలపై పెరుగుతున్న ఇంధన భారాన్ని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ యాదగిరిగుట్ట నుంచి తుర్కపల్లి మండల కేంద్రం వరకు ఈ యాత్ర నిర్వహించారు. యాత్రలో భాగంగా మల్లాపూర్, దత్తాయిపల్లి, వెంకటాపురం గ్రామాల మీదుగా తుర్కపల్లికి చేరుకున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్థానిక ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోవడం, లారీల కొరత కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. రైతులు తమ పంటను విక్రయించేందుకు ఇబ్బందులు పడకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. జూన్ 2వ తేదీ నాటికి అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తికావాలని, ఆ తర్వాత కూడా ఎక్కడైనా ధాన్యం నిల్వలు కనిపిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లారీల కొరతను వెంటనే పరిష్కరించి ధాన్యాన్ని మిల్లులకు వేగంగా తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి ప్రజలపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు జాప్యంపై అన్నదాతల ఆగ్రహం

- నమిలే క్రాస్ రోడ్డుపై రైతుల రాస్తారోకో
- కేంద్రాల్లో పేరుకుపోయిన కుప్పలు.. అకాల వర్షాల భయం
- రవాణా, గన్నీ సంచుల కొరతపై నిరసన
- అధికారుల హామీతో విరమణ

**తొలివెలుగు, రాజాపేట:** ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జరుగుతున్న తీవ్ర జాప్యాన్ని నిరసిస్తూ రాజాపేట మండలంలోని నమిలే గ్రామ రైతులు శనివారం రాస్తారోకో నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి వారాలు గడుస్తున్నా తూకాలు వేయకపోవడం, తరుగు పేరుతో ఇబ్బందులకు గురిచేస్తుండటంతో ఆగ్రహించిన అన్నదాతలు పెద్ద ఎత్తున తరలివచ్చి నమిలే క్రాస్‌రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. అహర్నిశలు శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు కేంద్రాలకు వస్తే ఇక్కడే వారాల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆకాశం మేఘావృతమై అకాల వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తుండటంతో రాత్రింబవళ్లు ధాన్యపు కుప్పల వద్దే కాపలా ఉంటున్నట్లు తెలిపారు. వర్షం వస్తే ధాన్యం తడిసి ముద్దయి నాణ్యత దెబ్బతింటుందని, తద్వారా భారీగా నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రాల్లో సరిపడా సిబ్బంది లేకపోవడం, గన్నీ సంచుల కొరత, రవాణా వాహనాల సమస్యల వల్లే కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని ఆరోపించారు. తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించకపోవడంతో కొత్తగా వచ్చే ధాన్యానికి స్థలం కరువైందని పేర్కొన్నారు. రాస్తారోకోతో వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని రైతులతో చర్చలు జరిపారు. కొనుగోలు ప్రక్రియను వెంటనే వేగవంతం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

# నేతన్నల దీక్ష.. కదలని యాజమాన్యాలు!


- రఘునాథపురంలో హోరెత్తిన చేనేత కార్మికుల సమ్మె
- తొమ్మిదో రోజుకు చేరిన పోరాటం
- ఆరేళ్లుగా కూలి పెంచకపోవడం విడ్డూరం: సీపీఐ నేత లింగం
- ధరలు పెరిగినా.. కార్మికుల శ్రమకు ప్రతిఫలం శూన్యం



**తొలివెలుగు, రాజాపేట :** మండలంలోని రఘునాథపురం గ్రామంలో భావనరుషి చేనేత కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం నాటికి తొమ్మిదో రోజుకు చేరుకుంది. కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ వారం రోజులకు పైగా కార్మికులు సమ్మె బాట పట్టినా యాజమాన్యాల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో శనివారం కార్మికులు దీక్ష చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం సందర్శించి కార్మికులకు పూర్తి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం ప్రతి రెండేళ్లకు ఒకసారి చేనేత కార్మికుల కూలి రేట్లు పెంచాల్సి ఉన్నప్పటికీ యాజమాన్యాలు నిర్లక్ష్యం వహించడం సమంజసం కాదన్నారు. గత ఆరేళ్లుగా కూలి రేట్లు పెంచకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో నిత్యవసర వస్తువులతో పాటు పెట్రోల్, డీజిల్ ధరలు రెండింతలు పెరిగిన ప్రస్తుత తరుణంలో.. రెక్కాడితే గాని డొక్కాడని చేనేత కార్మికుల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కకపోవడం బాధాకరమన్నారు. యాజమాన్యాలు తమ మొండివైఖరిని వీడి, మానవతా దృక్పథంతో ఆలోచించి కార్మికులకు కూలి రేట్లు వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మూల పోచయ్య, గణపురం నర్సింలు, దాసరి రమేష్, బల్ల శ్రీనివాస్, మదనాల వెంకటేష్, మదనాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఐకేపీ కేంద్రంలో 'వడ్ల' చోరీ కలకలం!

- రైతు రాశి నుంచి 15 బస్తాల ధాన్యం మాయం
- నర్సాపూర్‌లో అన్నదాతల ఆందోళన
- కొనుగోలు కేంద్రాల్లో భద్రత కరువైందని ఆగ్రహం



**తొలివెలుగు, రాజాపేట:** మండలంలోని నర్సాపూర్ గ్రామంలో గల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో శనివారం వడ్ల చోరీ ఘటన కలకలం రేపింది. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కోసం కేంద్రాలకు తీసుకువచ్చి రాశులుగా పోసి ఎదురుచూస్తున్న తరుణంలో ఈ ఘటన చోటుచేసుకోవడం అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. బాధిత రైతు, గ్రామస్తుల కథనం ప్రకారం.. నర్సాపూర్ గ్రామానికి చెందిన రైతు తుమ్మ ప్రశాంత్ తన పొలంలో పండిన వడ్లను విక్రయించేందుకు స్థానిక ఐకేపీ కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి రాశిగా పోశాడు. శుక్రవారం రాత్రి కొనుగోలు కేంద్రం వద్ద ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకున్న గుర్తు తెలియని వ్యక్తులు.. ప్రశాంత్‌కు చెందిన వడ్ల రాశి నుంచి సుమారు 15 బస్తాల ధాన్యాన్ని చోరీ చేశారు. శనివారం ఉదయం కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతు తన వడ్ల రాశి తగ్గిపోవడాన్ని గమనించి నిర్వాహకులకు, గ్రామస్తులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న స్థానిక రైతులు కేంద్రానికి చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీనికి తోడు రాత్రి వేళల్లో సరైన భద్రత లేకపోవడం వల్లే ఇలాంటి దొంగతనాలు జరుగుతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద రాత్రి కాపలాదారులను, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి చోరీపై విచారణ జరిపి, బాధిత రైతుకు నష్టపరిహారం అందించాలని కోరారు.



# విద్యార్థుల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించాలి

- స్నేహ సంఘాల 'మాక్ పార్లమెంట్'లో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు
- సామాజిక అంశాలపై గళమెత్తిన జిల్లా బాలికలు
- ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** విద్యార్థుల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు మాక్ పార్లమెంట్ వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో '99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో యుక్తవయసు బాలికల 'స్నేహ సంఘాల' మాక్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి ఎంపికైన బాలికలు సభాపతి, మంత్రులు, ప్రతిపక్ష సభ్యులు, ప్రజాప్రతినిధుల పాత్రలను పోషిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరును ప్రతిబింబించారు. సభా నిర్వహణ, చర్చలు, ప్రశ్నోత్తరాల ద్వారా బాలల హక్కులు, బాలికల భద్రత, విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పోషకాహారం, తాగునీటి సమస్యలు వంటి కీలక అంశాలపై తమ అభిప్రాయాలను ధైర్యంగా వెల్లడించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీలో యుక్తవయసు బాలికల రక్షణ, సంక్షేమం కోసం స్నేహ సంఘాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాల్య వివాహాల నివారణకు '1098' చైల్డ్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. బాలికలు తమ హక్కులపై అవగాహన పెంచుకుని సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ) నాగిరెడ్డి మాట్లాడుతూ.. బాలికలు విద్యతో పాటు నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి తమ లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. అనంతరం మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ అధికారి నర్సింహారావు, అడిషనల్ డీఆర్‌డీఓ సురేష్, డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







# సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా నల్ల బసవయ్య, ప్రధాన కార్యదర్శిగా చెరుకు ప్రభాకర్
- పోచంపల్లి తాపీ పనివారి సంఘ భవనంలో ఏకగ్రీవ ఎన్నిక
- నూతన కార్యవర్గానికి సభ్యుల అభినందనలు

**భూదాన్ పోచంపల్లి, (తొలివెలుగు ప్రతినిధి కేమ విష్ణు):** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక తాపీ పనివారి సంఘం భవనంలో అసోసియేషన్ సభ్యుల సమక్షంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేశారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా నల్ల బసవయ్య, ప్రధాన కార్యదర్శిగా చెరుకు ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పబ్బుల బసవయ్య, బండారు బసవయ్య, సహాయ కార్యదర్శిగా ఎర్రబోతు మధుసూదన్, కోశాధికారిగా ఒంటెద్దు నరసింహ బాధ్యతలు చేపట్టనున్నారు. గౌరవ అధ్యక్షులుగా పెద్దల యాదయ్య, ఎర్ర బిక్షపతి, గౌరవ సలహాదారులుగా పబ్బు యాదగిరి, అల్లాబత్తిని నారాయణలను నియమించారు. కార్యవర్గ సభ్యులుగా ఒంటెద్దు సత్యనారాయణ, కందుకూరి కిషన్, పడిగల ఆనంద్, అల్లాబత్తిని రమేష్, బండారు భాస్కర్, కొత్త బాలకృష్ణలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధి, కాంట్రాక్టర్ల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. సభ్యుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేసి సంఘాన్ని ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా అసోసియేషన్ సభ్యులు, తాపీ కార్మికులు నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు, కార్మికులు పాల్గొన్నారు.

# చిన్న బజార్‌లో గ్యాస్ 'దందా'.. అధికారుల మెరుపు దాడి!

- భూదాన్ పోచంపల్లిలో అక్రమ గ్యాస్ సిలిండర్లు పట్టివేత
- 14 గృహ అవసరాల, 3 కమర్షియల్ సిలిండర్లు సీజ్
- నిబంధనలకు విరుద్ధంగా నిల్వ.. కేసు నమోదు చేసి దర్యాప్తు
- అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవు: ఇన్‌స్పెక్టర్ అజయ్ బాబు



**భూదాన్ పోచంపల్లి, (తొలివెలుగు ప్రతినిధి కేమ విష్ణు):** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని చిన్న బజార్ ప్రాంతంలో సాగుతున్న అక్రమ గ్యాస్ సిలిండర్ల దందాపై సివిల్ సప్లై అధికారులు మెరుపు దాడులు నిర్వహించి భారీగా సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గృహ అవసరాల, కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచి విక్రయిస్తున్నారనే సమాచారంతో శనివారం అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ అజయ్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న బజార్ ప్రాంతంలో కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచి బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో సిబ్బందితో కలిసి నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా దాచిన 14 గృహ అవసరాల (డొమెస్టిక్) సిలిండర్లు, 3 కమర్షియల్ సిలిండర్లు బయటపడ్డాయి. స్వాధీనం చేసుకున్న మొత్తం 17 సిలిండర్లను అధికారులు సీజ్ చేసి తదుపరి చర్యలు ప్రారంభించారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించే గృహ అవసరాల సిలిండర్లను ఇతర అవసరాలకు మళ్లించడం, అక్రమంగా నిల్వ ఉంచి విక్రయించడం చట్టరీత్యా నేరమని ఇన్‌స్పెక్టర్ అజయ్ బాబు హెచ్చరించారు. అక్రమ గ్యాస్ వ్యాపారాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసిన ఆయన, నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లై కానిస్టేబుళ్లు నర్రా ప్రభాకర్, కొండల్ యాదవ్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంద్రపాలనగరంలో తీరిన తాగునీటి కష్టాలు

- రైతువేదిక వద్ద బోరుబావికి మోటారు, పైప్‌లైన్ ఏర్పాటు
- తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు
- సర్పంచ్ విక్రమ్‌కు వార్డు ప్రజల అభినందనలు

**తొలివెలుగు, రామన్నపేట:** మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో తాగునీటి సమస్యకు శనివారం గ్రామ పంచాయతీ యంత్రాంగం శాశ్వత పరిష్కారం చూపింది. గ్రామంలోని 4వ వార్డు పరిధిలో గల రైతువేదిక వద్ద ఉన్న బోరుబావికి నూతనంగా మోటారు అమర్చడంతో పాటు పైప్‌లైన్ పనులు పూర్తి చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించింది. ఈ సందర్భంగా సర్పంచ్ విక్రమ్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో గ్రామంలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా 4వ వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి రైతువేదిక వద్ద ఉన్న బోరుబావికి మోటారు ఏర్పాటు చేసి, పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరాను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని, గ్రామాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. తాగునీటి సమస్యను త్వరితగతిన పరిష్కరించినందుకు వార్డు ప్రజలు, స్థానిక నాయకులు సర్పంచ్ విక్రమ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలకు ఉపశమనం కలిగించిన ఈ చర్యపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, 4వ వార్డు సభ్యురాలు చిన్నలచ్చి శంకరమ్మ, మాజీ ఏఎంసీ



డైరెక్టర్ గోళ్లేపల్లి యాదయ్య పాల్గొన్నారు. అలాగే యువ నాయకులు సింగణబోయిన గణేష్, పగుడాల సుదర్శన్, నీరుడు వెంకటేష్, బండారు దుర్గయ్య, భూతం బిక్షపతి, రాస సత్తయ్య, నక్క వెంకటేష్, గర్ధాస్ కరుణాకర్, రాధారపు పద్మ, దొంత నర్సింహా, రాగిరి మల్లేశం, గర్ధాస్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# చౌటుప్పల్ అభివృద్ధికి రూ.3.27 కోట్లు మంజూరు

- కౌన్సిల్ సాధారణ సమావేశంలో నిధుల ఆమోదం
- ?స్మశాన వాటికలు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి పెద్దపీట
- ?వివిధ శాఖల అధికారులతో చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్ సమీక్ష
- ?కొత్తగా నాలుగు బస్తీ దవాఖానాల మంజూరు

**తొలివెలుగు, ?చౌటుప్పల్:** చౌటుప్పల్ పట్టణ ప్రగతి, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా మున్సిపల్ కౌన్సిల్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. శనివారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న అత్యవసర సమస్యల పరిష్కారం కోసం రూ. 3 కోట్ల 27 లక్షల భారీ నిధులను మంజూరు చేస్తూ కౌన్సిల్ సుదీర్ఘ చర్చల అనంతరం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

?స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని రెండు ప్రధాన స్మశాన వాటికల అభివృద్ధి పనులకు కౌన్సిల్ ప్రత్యేకంగా తీర్మానం చేసింది. తాజా నిధులతో అత్యవసర మురుగు కాలువల (డ్రైనేజీ) నిర్మాణాలు, అంతర్గత రవాణాను మెరుగుపరిచేందుకు సీసీ రోడ్లు, పట్టణాన్ని వెలుగులతో నింపేందుకు నూతన వీధి దీపాల ఏర్పాటు తదితర పనులను చేపట్టనున్నట్లు తీర్మానించారు.

**అధికారులతో ముఖాముఖి సమీక్ష:**

సమావేశంలో భాగంగా చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్ వివిధ ప్రభుత్వ విభాగాల (లైన్ డిపార్ట్‌మెంట్) అధికారులతో వార్డుల వారీగా సమస్యలపై ప్రత్యేకంగా సమీక్షించారు. కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలకు అక్కడికక్కడే పరిష్కార మార్గాలను సూచించారు. విద్యుత్ స్తంభాల మార్పిడి, వీధి దీపాలపై విద్యుత్ శాఖ ఏఈ సతీష్‌తో, తాగునీటి లీకేజీలు, అమృత్ 2.0 వాటర్ ట్యాంకుల నిర్వహణపై మిషన్ భగీరథ ఏఈలు శ్వేత, వినయ్ కుమార్‌లతో చర్చించారు. ప్రధాన రహదారులు, వలిగొండ రోడ్డు మరమ్మతులపై ఆర్ అండ్ బీ ఏఈ నవీన్‌తో సమీక్షించారు. మున్సిపల్ పరిధిలో కొత్తగా నాలుగు బస్తీ దవాఖానాలు మంజూరైనట్లు ఈ సందర్భంగా ఆరోగ్య శాఖ ప్రతినిధి డా. కాటమరాజు కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. విద్యాశాఖ ఎంఈఓ గురువారావు, అంగన్వాడి సూపర్‌వైజర్ శోభారాణి, ఎఫ్‌ఆర్‌ఓలతో పాఠశాలల వసతులు, ప్రజారోగ్యంపై చర్చించారు. ఈ కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ నితీష్ రెడ్డి, ఆర్ఓ అంజయ్య, సీనియర్ అసిస్టెంట్లు రఘుపతి, దీప, వార్డుల కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



# కొనుగోళ్లలో తీవ్ర జాప్యం: రోంతకెక్కిన అన్నదాత!

- రెండు నెలలుగా ఐకేపీ కేంద్రంలోనే ధాన్యం నిల్వలు
- మరో 50 లారీల వడ్లు కొనుగోలు చేయాల్సి ఉందని రైతుల ఆవేదన
- వడ్ల బస్తాలు తగులబెట్టి వినూత్న నిరసన
- స్పందించకుంటే తహశీల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరిక

**తొలివెలుగు, రామన్నపేట:** మండలంలోని దుబ్బాక గ్రామ ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు తీవ్ర జాప్యానికి గురవడంతో రైతులు శనివారం ఆందోళనకు దిగారు. రెండు నెలలుగా ధాన్యం కొనుగోలు పూర్తికాకపోవడంతో విసిగిపోయిన రైతులు రోడ్డుపై వడ్ల బస్తాలను తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. రైతుల వివరాల ప్రకారం.. రెండు నెలల క్రితమే పెద్ద ఎత్తున ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించినప్పటికీ ఇప్పటివరకు కేవలం 17 లారీల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇంకా సుమారు 50 లారీల మేర వడ్లు కేంద్రంలోనే నిల్వ ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలంలో కురిసిన అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోయిందని, దానిని పలుమార్లు ఆరబెట్టాల్సి వచ్చిందని రైతులు వాపోయారు. నాలుగు సార్లకుపైగా ధాన్యాన్ని ఎండబెట్టేందుకు ప్రయత్నించినప్పటికీ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. వర్షాల భయం, తూకాల ప్రక్రియలో జాప్యం, కొనుగోళ్లలో నిర్లక్ష్యంతో తీవ్ర మనోవేదనకు గురయ్యామని పేర్కొన్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని రైతులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రామన్నపేట తహశీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో రైతులు క్యాస వీరాస్వామి, బైరోజు ధనంజయ్య, గుండాల రాంబాబు, సల్ల బిక్షం, మల్లారెడ్డి, అంజయ్య, గుండాల మల్లయ్య, గంగని చింటు, సాయి శేఖర్, నీలా మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. రైతుల ఆందోళనతో దుబ్బాక గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

# అంగన్‌వాడీల వైపు చిన్నారుల అడుగులు!

- నేమిలలో ఘనంగా 'బడిబాట'.. రోడ్డెక్కిన బుజ్జాయిలు
- పిల్లల భవిష్యత్తుకు అంగన్‌వాడీలే పునాది: సర్పంచ్ పులి రాజు
- సర్పంచ్, ఉపసర్పంచ్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ర్యాలీ

**తొలివెలుగు, రాజపేట:** మండలంలోని నేమిల గ్రామంలో శనివారం ఏఎంసీ-2 అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో 'బడిబాట' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్ననాటి నుంచే పిల్లల్లో అక్షరాస్యత, క్రమశిక్షణ, సామాజిక అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ చిన్నారులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులతో కలిసి గ్రామ ప్రధాన వీధుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నారులు నినాదాలు చేస్తూ గ్రామ ప్రజల్లో అంగన్‌వాడీల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గ్రామ సర్పంచ్ పులి రాజు, ఉపసర్పంచ్ మార్క శివలు ర్యాలీని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మూడు నుంచి ఐదేళ్ల వయస్సు గల పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడీలు పునాది వంటివని పేర్కొన్నారు. ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా నాణ్యమైన బోధన అందుతుందని, గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, వార్డు సభ్యులు, తల్లులు, చిన్నారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# స్వాతంత్ర్య సమరయోధురాలికి ఘన నివాళి

- కనపర్తి అనసూయమ్మ జ్ఞాపకార్థం మహా అన్నదానం
- సూర్యాపేటలో వెయ్యి మందికి అన్నప్రసాద వితరణ
- నేటి యువతకు ఆమె పోరాట పటిమ ఆదర్శప్రాయం

**తొలివెలుగు, సూర్యాపేట:** దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధులను స్మరించుకోవడం, వారి ఆశయాలను ముందు తరాలకు అందించడం మనందరి బాధ్యత అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు కనపర్తి అనసూయమ్మ జ్ఞాపకార్థం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆమే కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని 37వ వార్డు పరిధిలో గల వాణిజ్య భవన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ సేవా కార్యక్రమానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు వెయ్యి మందికి పైగా ప్రజలకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేసి అనసూయమ్మకు అక్షర నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కనపర్తి అనసూయమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సంగ్రామంలో అనసూయమ్మ చేసిన విశేష సేవలు, చూపిన తెగువ నేటి యువతకు ఎంతో ఆదర్శమని కొనియాడారు. ఆమె జీవితం భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. సమాజంలో సేవా భావాన్ని పెంపొందించాలన్న ఆమె ఆశయ సాధన కోసమే ప్రతి ఏడాదీ ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, పేదలకు అన్నదానం చేయడం ద్వారా ఆమెకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కాసర్ల అరుణ, మేఘరాజు జ్ఞాన కుమారి, కంచర్ల సరళ, కనపర్తి మాధవి, కనపర్తి సాయి నితిన్, ప్రత్యూష, దాసరపు సాయి కృష్ణ, అనూష, కంచర్ల శ్రీకాంత్ తదితరులతో పాటు బంధుమిత్రులు, స్థానికులు పాల్గొన్నారు.



# 'పీఎం సూర్య ఘర్'తో ఉచిత విద్యుత్

- పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న ఎంపీడీఓ రాములు
- రామన్నపేట పంచాయతీ కార్యాలయంలో అవగాహన సదస్సు
- సోలార్ ప్యానెళ్లతో విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందన్న అధికారులు



**తొలివెలుగు, రామన్నపేట:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రామన్నపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) రాములు సూచించారు. శనివారం రామన్నపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానిక సర్పంచ్ సత్యనారాయణ అధ్యక్షతన ఈ పథకంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ రాములు మాట్లాడుతూ.. గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్ అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇంటి పైకప్పులపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారం గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను విద్యుత్ గ్రిడ్‌కు విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశం కూడా ఉందని వివరించారు. పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, దరఖాస్తు విధానం, అర్హత ప్రమాణాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఎంపీవో రావూఫ్ అలీ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణతో పాటు పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించడంలో సోలార్ విద్యుత్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సైదిరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రూ. 4 లక్షల లంచం అడిగి.. నాంపల్లిలోని సైబర్‌క్రైమ్ బ్యూరోలో శనివారం ఏసీబీ దాడులు నిర్వహించింది. సైబర్‌నేరగాళ్ల ఆట కట్టించాల్సిన పోలీసే లంచం తీసుకుంటూ అడ్డంగా ఏసీబీ వలలో చిక్కారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బత్తుల మహేందర్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.

# రూ. 4 లక్షల లంచం అడిగి..

**ఏసీబీకి చిక్కిన ఇన్‌స్పెక్టర్ మహేందర్**

సిటీబ్యూరో: నాంపల్లిలోని సైబర్‌క్రైమ్ బ్యూరోలో శనివారం ఏసీబీ దాడులు నిర్వహించింది. సైబర్‌నేరగాళ్ల ఆట కట్టించాల్సిన పోలీసే లంచం తీసుకుంటూ అడ్డంగా ఏసీబీ వలలో చిక్కారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బత్తుల మహేందర్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. సైబర్ మోసం కేసులో బాధితుడి కుటుంబసభ్యుల పేర్లు చేర్చకుండా ఉండేందుకు ఓ వ్యక్తిని మహేందర్ రూ.9 లక్షలు డిమాండ్ చేశారని ఏసీబీ అధికారులు తెలిపారు. బాధితుడి నుంచి ఇప్పటికే రూ.5 లక్షలు నగదు గుట్టుచప్పుడు కాకుండా తీసుకున్నారు. మిగిలిన రూ.4 లక్షల కోసం బెదిరింపులకు పాల్పడినట్లు ఏసీబీకి ఆయనపై ఫిర్యాదు అందింది.

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- కలెక్టరేట్‌లో ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ భాస్కర్ రావు
- అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం
- హాజరైన జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి, ఏవో అంజిరెడ్డి



**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలో ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సూచించారు. జూన్ 2న నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల నేపథ్యంలో శనివారం కలెక్టరేట్ ఆవరణలో చేపడుతున్న ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధాన వేడుకల ప్రాంగణం, జాతీయ పతాక ఆవిష్కరణ స్థలం, పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. అనంతరం వేదిక వద్ద విద్యుత్ సరఫరా, తాగునీటి సదుపాయం, పారిశుధ్య నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ.. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు జిల్లా ప్రతిష్ఠను ప్రతిబింబించేలా ఉండాలని అన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమయానికి పూర్తి చేయాలని, వేడుకల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జూన్ 2 వేడుకల జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలనాధికారి (ఏవో) అంజిరెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బెంగళూరులో ఏఎంబీ సినిమాస్... డాల్బీ విజన్ ఆస్వాదించిన మహేశ్ బాబు

### తమ కలలను సాకారం చేస్తున్న ఏఎంబీ బృందాన్ని చూసి గర్వంగా ఉందన్న మహేశ్





టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు ఇటీవల బెంగళూరులో పర్యటించారు. అక్కడ కొత్తగా ప్రారంభమైన తమ ఏఎంబీ సినిమాస్ మల్టీప్లెక్స్‌ను ఆయన సందర్శించారు. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా డాల్బీ విజన్ టెక్నాలజీతో ఏర్పాటైన ఈ థియేటర్‌లో సినిమా చూసి అద్భుతమైన అనుభూతిని పొందానని వెల్లడించారు. ఈ సందర్భంగా తనపై అభిమానులు చూపిన ప్రేమకు ముగ్ధుడైన మహేశ్, తన సంతోషాన్ని సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. “సౌత్ ఇండియాలోనే మొదటి డాల్బీ విజన్‌ను మా ఏఎంబీ సినిమాస్ బెంగళూరులో అనుభవించడం చాలా ప్రత్యేకంగా అనిపించింది. నన్ను చూడటానికి ఎంతో దూరం నుంచి వచ్చిన అభిమానులను కలవడం కూడా అంతే సంతోషాన్నిచ్చింది. బెంగళూరు చూపిన ఈ ప్రేమకు నేను వినమ్రుడినయ్యాను. గాలి నిండా ప్రేమే నిండిపోయింది” అని మహేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అదేవిధంగా, తమ కలలను సాకారం చేయడానికి అహర్నిశలు శ్రమించిన ఏఎంబీ సినిమాస్ బృందాన్ని చూసి గర్వంగా ఉందని ప్రశంసించారు. హైదరాబాద్‌లో ఇప్పటికే ఏఎంబీ సినిమాస్ విజయవంతంగా నడుస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు బెంగళూరులోనూ తమ బ్రాంచ్‌ను విస్తరించడం ద్వారా మహేశ్ బాబు వ్యాపార రంగంలో మరో ముందడుగు వేశారు. ఈ పర్యటనకు సంబంధించిన ఫోటోలు, మహేశ్ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



## ఆయనే నాకు సెకండ్ లైఫ్ ఇచ్చారు: వరలక్ష్మి శరత్ కుమార్

### డైరెక్టర్ గా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన వరలక్ష్మి

తన విలక్షణ నటనతో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించుకున్న నటి వరలక్ష్మి శరత్‌కుమార్. సీనియర్ నటుడు శరత్ కుమార్ కుమార్తెగా ఇండస్ట్రీలోకి వచ్చిన వరలక్ష్మి... ఆ తర్వాత ఇండస్ట్రీలో తన కాళ్లపై తాను నిలబడింది. ఇప్పుడు దర్శకురాలిగా తన సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించింది. డైరెక్టర్ గా తన మొదటి చిత్రం ‘సరస్వతి’తో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ... “డైరెక్టర్ గోపీచంద్ మలినేని సార్ నా గురువు, మెంటార్, గైడ్. ఆయన కారణంగానే నేను ఈ రోజు ఇక్కడ ఉన్నాను. ఆయనే నాకు సెకండ్ లైఫ్ ఇచ్చారు” అంటూ ఆమె భావోద్వేగానికి గురైంది. ఇండస్ట్రీలో అమ్మాయిలు సర్వైవ్ అవడం చాలా కష్టమని, వారికి సపోర్ట్ ఇవ్వాలని ఆమె కోరింది. కనబడకుండా పోయిన కూతురి కోసం ఒక అమ్మ ఎంత దూరం వెళుతుందో చూపించే కథాంశంతో ‘సరస్వతి’ తెరకెక్కుతోంది. ఈ సినిమాలో వరలక్ష్మితో పాటు ప్రియమణి, ప్రకాశ్ రాజ్ తదితరులు నటిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. దోసా డైరీస్ బ్యానర్ పై ఈ సినిమాను నిర్మిస్తున్నారు.



## గేమ్‌మాస్టర్ ఎవరు?

‘మీరు నా నుంచి ఏం కోరుకుంటున్నారో.. ఏం మిస్ అవుతున్నారో అనే విషయాలన్నింటిని నేను గమనిస్తున్నా. ‘ఫలక్‌నుమా దాస్’ తీయకముందు నాలో ఓ కసి ఉండేది. ఈ సినిమాకు ముందు అది పదింతలు పెరిగింది. పిల్లలు, సున్నిత మనస్కులు ఈ సినిమాకు దూరంగా ఉండండి’ అన్నారు విశ్వక్‌సేన్. ఆయన కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన మూవీ ‘కల్ట్’. తారక్ సినిమాస్ పతాకంపై సందీప్ కాకరాల నిర్మిస్తున్నారు. ఇండియన్ తొలి స్లాషర్ జానర్ (హింస, రక్తపాతంతో కూడిన) మూవీగా వాస్తవ సంఘటనల ప్రేరణతో ఈ చిత్రాన్ని రూపొందించారు. శనివారం టీజర్‌ను లాంచ్ చేశారు. గోవా పబ్‌లో పార్టీ హోస్ట్ మొదలుపెట్టే ఓ ప్రాణాంతకమైన ఆటలో ఓ మిత్రబృందం ఎలా చిక్కుకుంది? ఒక్కొక్కరిని హతమారుస్తూ ముందుకుసాగే ఈ కథలో అసలు గేమ్ మాస్టర్ ఎవరు? అతను రక్షకుడా? ప్రమాదకారుడా? అనే ప్రశ్నలతో టీజర్ ఆసాంతం ఉత్కంఠను పంచింది. ఈ సినిమాలో వందమంది కొత్త నటీనటులున్నారని విశ్వక్‌సేన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర మాటల రచయిత తరుణ్‌భాస్కర్, సంగీత దర్శకుడు రవిబస్రూర్‌తో పాటు చిత్ర ప్రధాన తారాగణమంతా పాల్గొన్నారు. గాయత్రీ భరద్వాజ్, తారక్ పొన్నప, మురళీశర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన, నిర్మాత, దర్శకత్వం: విశ్వక్‌సేన్.

## గర్భవతిగానే సినిమా చేశా: లావణ్య త్రిపాఠి

### సినిమా మొదలైన తర్వాత తనకు ప్రెగ్నెన్సీ అని తెలిసిందని వెల్లడి

మెగా కోడలు లావణ్య త్రిపాఠి పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో యాక్టివ్‌గా కొనసాగుతోంది. ఇటీవలే ఆమె పండంటి బాబుకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు, ఆమె ప్రధాన పాత్ర పోషించిన ‘సతీ లీలావతి’ మార్చి 6న విడుదలకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమోషన్స్‌లో భాగంగా యాంకర్ సుమ కనకాలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో లావణ్య తన ప్రెగ్నెన్సీ సమయంలో ఎదుర్కొన్న అనుభవాలను పంచుకుంది. “ఈ సినిమా పనులు మొదలైన తర్వాత నాకు ప్రెగ్నెన్సీ అని తెలిసింది. సినిమాకు ‘నో’ చెబితే నిర్మాతలకు నష్టం అవుతుందని భావించాను. అందుకే గర్భవతిగానే షూటింగ్ చేశాను. వాంతులు అయ్యాక కూడా సెట్‌కి వెళ్లేదాన్ని. మైగ్రేన్ వచ్చినప్పుడు టాబ్లెట్స్ వేసుకుని షూట్ చేసేదాన్ని” అని లావణ్య వెల్లడించింది. యాక్షన్ సన్నివేశాలు చేయాల్సి వచ్చినప్పుడు ఎంతో భయం వేసేదని, ప్రతి షెడ్యూల్ ముగిసిన తర్వాత ఆసుపత్రికి వెళ్లి చెకప్ చేయించుకునేదాన్నని చెప్పింది. మూడు నెలల్లోపే షూటింగ్ పూర్తి చేసేలా ప్లాన్ చేశారని తెలిపింది. డ్యాన్స్ సీక్వెన్స్ సమయంలో కూడా భయం వేసిందని, కొరియోగ్రాఫర్ బృందా మాస్టర్ తన పరిస్థితిని అర్థం చేసుకుని స్టెప్స్ సర్దుబాటు చేశారని చెప్పింది. బేబీ బంప్ కనిపించకుండా కాస్ట్యూమ్స్ లూజ్‌గా డిజైన్ చేయించారని వెల్లడించింది. నాలుగో నెలలో కొన్ని సన్నివేశాలు ప్యాచ్‌వర్క్ చేయాల్సి వచ్చిందని తెలిపింది. ఇంట్లోవాళ్లు మొదట భయపడినా, చివరికి పూర్తి సపోర్ట్ ఇచ్చారని, ముఖ్యంగా భర్త వరుణ్ చాలా అండగా నిలిచారని లావణ్య చెప్పింది. డాక్టర్లు ఎక్కువ ప్రయాణాలు చేయొద్దని చెప్పారని... అయితే, షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగేది కాబట్టి పొద్దున్నే లేచి వెళ్లడం కష్టంగా అనిపించేదని తెలిపారు. “ప్రెగ్నెన్సీ విషయం షూటింగ్ టీమ్‌కు మొదట్లో తెలియదు. తెలిస్తే ప్రత్యేకంగా చూస్తారేమోనని భయంతో చెప్పలేదు” అని ఆమె వెల్లడించింది.





## గాడ్స్ అండ్ సోల్జర్స్

రఫ్ నోట్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ద్విభాషా చిత్రం ‘గాడ్స అండ్ సోల్జర్స్’. ఆరి అరుజునన్, రాజ్‌తరుణ్, భరత్, అమూ అభిరామి, కిశోర్ ఇందులో ప్రధాన పాత్రధారులు. సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం చిత్రీకరణ పూర్తి చేసుకున్నది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో నిమగ్నమైంది. వాస్తవిక సంఘటనలతో వాణిజ్య అంశాల మేళవింపుగా ఈ సినిమా రూపొందుతున్నదని, ఈ సినిమాకోసం అందరూ ప్రాణం పెట్టి పనిచేశారని, కథాపరంగా, సాంకేతికంగా ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని పంచే సినిమా ఇదని, త్వరలోనే టీజర్‌ని విడుదల చేయనున్నామని, సినిమా విడుదల తేదీని త్వరలో తెలియజేస్తామని మేకర్స్ చెప్పారు.



## గ్లోబల్ స్టార్ కాబోతున్న ప్రియమణి!

### ఇండో-అమెరికన్ మూవీలో నటించబోతున్న ప్రియమణి

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ కు వెళ్లిన ప్రియమణి... పలు వెబ్ సిరీస్ లలో కూడా నటిస్తూ బిజీగా ఉంటోంది. ఇప్పుడు హాలీవుడ్ మూవీలో నటించేందుకు సిద్ధమవుతోంది. ఇండో-అమెరికన్ చిత్రంలో ప్రియమణి ప్రధాన పాత్రకు ఎంపికయింది. బాలీవుడ్ నటుడు మోహిత్ రైనాతో కలిసి ఆమె ఈ అంతర్జాతీయ చిత్రంలో నటించబోతోంది.హర్ష్ మహదేశ్వర్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాను అమెరికాకు చెందిన రెడ్ బైసన్ ప్రొడక్షన్స్, ముంబైలోని అజూర్ ఎంటర్టైన్మెంట్ సంయుక్తంగా నిర్మించనున్నాయి. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా నిర్మాణ సంస్థలు అధికారికంగా ప్రకటించాయి.భారతీయ, అమెరికా సంస్కృతుల కలయికతో, ఒక వలస కుటుంబం ఎదుర్కొనే భావోద్వేగపూరిత ప్రయాణమే ఈ సినిమా కథాంశం. హాలీవుడ్ సూపర్ హిట్ సినిమాలకు పనిచేసిన అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు ఈ ప్రాజెక్ట్ కోసం పనిచేస్తుండటం గమనార్హం. ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్ లో ప్రారంభం కానుంది.